క్షణక్షణం.. భయం భయం

పూర్తిగా శిథిలావస్థకు చేరిన మూడో పట్టణ పోలీస్ స్టేషన్



శిథిలావస్థకు చేరిన త్రీ టౌన్ పోలీస్ స్టేషన్


కూలిపోయే స్థితిలో స్టేషన్ మెట్లు

'ఏ నిమిషానికి ఏమి జరుగునో.. ఎవరూహించెదరూ...' అని హృదయ విదారకంగా సాగే ఈ పాట లిరిక్ మూడో పట్టణ పోలీస్ స్టేషన్ భవన దుస్థితికి సరిగ్గా సరిపోతుంది. ప్రజలకు రక్షణ కల్పిస్తున్న రక్షకభటులకే ఇక్కడ రక్షణ కరువైంది. ఈ స్టేషన్ భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితికి చేరడంతో క్షణక్షణం.. భయం భయంగా పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రజలు కూడా ఎటు నుంచి ఏ ప్రమాదం వచ్చి పడుతుందోనని జంకుతూ స్టేషన్‌లోకి వెళ్లి వస్తున్నారు. నగరంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ మొత్తం పూర్తిగా శిథిలమైంది. గోడలు ఎక్కడికక్కడ పగుళ్లు ఇచ్చాయి. వాటిని చీల్చుకుంటూ పెద్ద పెద్ద మొక్కలు బయటకు వస్తున్నాయి. దీంతో ఏ క్షణాన భవనం కూలిపోతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. మా స్టేషన్‌కు మోక్షం ఎప్పుడు కలుగుతుందా అని పోలీస్ సిబ్బంది ఎదురు చూస్తున్నారు.

– బీచ్‌రోడ్డు

మాటలకే పరిమితమైన సీపీ ఆదేశాలు

నగర పోలీస్ కమిషనర్‌గా శంఖబ్రత బాగ్చి బాధ్యతలు స్వీకరించిన మొదట్లో మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఆ సమయంలో స్టేషన్ భవనం పరిస్థితిపై ఆరా తీసిన ఆయన.. వారం రోజుల్లో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అప్పటి సీఐ పార్థసారథి మరమ్మతుల అంచనా వ్యయం కోసం కాంట్రాక్టర్‌ను కూడా రప్పించారు. ఆయన వచ్చి స్టేషన్ మొత్తం పరిశీలించి, అంచనా వ్యయం వివరాలను సీఐకు తెలియజేశారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించాలనుకున్నారు. ఏం జరిగిందో తెలియదు కానీ ఆ పనుల్లో ఎటువంటి కదలిక రాలేదు.

పోలీస్ కమిషనర్ ఆదేశించినా.. కానరాని మరమ్మతులు

ఎనిమిది నెలలు గడిచినా.. ప్రారంభం కాని పనులు

స్టేషన్‌లోకి వెళ్లేందుకు జంకుతున్న ప్రజలు

మోక్షమెప్పుడని ఎదురు చూస్తున్న పోలీసులు

మరమ్మతులు ఎప్పుడు..?

పోలీస్ స్టేషన్ భవనానికి వారం రోజుల్లో మరమ్మతులు చేపట్టాలని నగర పోలీస్ కమిషనర్ స్వయంగా ఆదేశించడంతో సిబ్బంది అంతా ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. నిర్భయంగా విధులకు హాజరు కావచ్చని భావించారు. సీపీ ఆదేశించి ఎనిమిది నెలలవుతున్న మరమ్మతు పనులు మాత్రం ప్రారంభం కాలేదు. సీపీ ఆదేశాలు అమలు చేయడంలో అధికారులు అలసత్వం ఎందుకు చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.

అకాల వర్షాలతో ఆందోళన

నగరంలో రెండు రోజులుగా ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలు కురిశాయి. ఈ సమయంలో స్టేషన్ భవనం నుంచి ఏది విరిగి కిందకి పడుతుందోనని పోలీసులు భయం భయంగా విధులు నిర్వర్తించారు. మరో వైపు భారీ వర్షానికి స్టేషన్ ప్రాంగణంలో బురద పెద్ద మొత్తంలో పేరుకుపోయింది. ఇటు భవనం శిథిల స్థితిలో ఉండటం.. అటు ప్రాంగణం బురదమయం కావడంతో విధులు ఎలా నిర్వర్తించాలో అర్థం కాక పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


పగుళ్లు వచ్చిన పోలీస్ స్టేషన్ గోడలు


గోడను చీల్చుకుంటూ మొలిచిన మొక్కలు

భయపడుతున్న ఫిర్యాదుదారులు

త్రీ టౌన్ పీఎస్ భవనంలో ఆ స్టేషన్‌తోపాటు ద్వారకా ఏసీపీ కార్యాలయం, ఎంవీపీ క్రైం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. దీంతో నిరంతరం అనేక మంది ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు ఇక్కడికి వస్తుంటారు. ఈ భవనం ఎటు చూసినా పగుళ్లు, పెద్ద పెద్ద రంధ్రాలతోపాటు కూలే స్థితిలో మెట్లు ఉండటంతో ఫిర్యాదుదారులు స్టేషన్‌లోకి వెళ్లేందుకు భయపడుతున్నారు. ఎప్పుడు ఏ గోడ కూలి తమపై పడుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీలైనంతా వేగంగా తమ పని పూర్తిచేసుకుని స్టేషన్ నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆధునికీకరించి.. భద్రత, భరోసా కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఘనంగా దక్షిణామూర్తి ఆలయ వార్షికోత్సవం


దక్షిణామూర్తికి పూజలు చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం శ్రీ గౌరీ జ్ఞాన లింగేశ్వరాలయంలో కొలువైన దక్షిణామూర్తి ఆలయ మూడో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. స్వామికి తెల్లవారుజాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాలభాస్కర శర్మ భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం సభ్యుడు ఎస్.నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆహారంతో ఆరోగ్య సంరక్షణ


ఏయూక్యాంపస్: సరైన ఆహారం తీసుకోవడం వల్ల శరీర ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణమూర్తి అన్నారు. బీచ్ రోడ్డులో శుక్రవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ యవ్వనంగా కనిపించడానికి, వృద్ధాప్య ఛాయలను దూరం చేసే విధంగా ఐదు ఆహార పదార్థాలు దోహదపడతాయన్నారు. బాదం, సాల్మన్ చేప, చిలగడదుంప, సిట్రస్ పండ్లు, పెరుగు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. చర్మం కాంతివంతంగా ఉండటానికి, చర్మ దృఢత్వానికి, చర్మ ఆరోగ్యానికి ఈ పదార్థాలు ఎంతో మేలు చేస్తాయన్నారు. వీటిని ఆహారంలో భాగం చేర్చుకోవాలని సూచించారు.

హోటల్స్ క్రికెట్ లీగ్ ప్రారంభం


బెలూన్లు ఎగురవేసి పోటీలు ప్రారంభిస్తున్న హెచ్‌ఆర్‌ఏపీ ప్రతినిధులు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ సంఘం(హెచ్‌ఆర్‌ఏపీ) ఆధ్వర్యంలో మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం అంతర హోటల్స్ క్రికెట్ లీగ్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 16 హోటల్ జట్లు పాల్గొంటున్నాయి. హోటల్స్ సంఘం అధ్యక్షుడు ప్రశాంత్ తొలి మ్యాచ్‌ను ప్రారంభించారు. హోటల్ సిబ్బంది మధ్య స్నేహపూరిత వాతావరణాన్ని, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే ఈ పోటీల ఉద్దేశమని సంఘం ఉపాధ్యక్షుడు పవన్ కార్తీక్ తెలిపారు. స్టార్ కేటగిరీ హోటల్స్ మేనేజర్లు, హెచ్‌ఆర్ మేనేజర్లు పాల్గొన్నారు. తొలిరోజు మూడు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో ది పార్క్ హోటల్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. మేఘాలయ హోటల్ నిర్దేశించిన 47 పరుగుల విజయ లక్ష్యాన్ని కేవలం 4.4 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. రెండో మ్యాచ్‌లో రాక్‌డేల్ హోటల్ జట్టు నిర్ణీత ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసింది. ఐటీ ఫార్చ్యూన్ ఇన్ జట్టు తొమ్మిది వికెట్లు కోల్పోయి 91 పరుగులే చేసి ఓటమి పాలైంది. మూడో మ్యాచ్ ఏకపక్షంగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పామ్ బీచ్ జట్టు కేవలం రెండు వికెట్లు కోల్పోయి 188 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయల్ ఫోర్ట్ హోటల్ జట్టు ఏడు వికెట్లు కోల్పోయి 47 పరుగులు మాత్రమే చేయగలిగింది.

గుట్టలుగా ఖాళీ కొబ్బరిబొండాలు


నంది గుడి రోడ్డు పక్కన పెద్ద ఎత్తున వాడేసిన కొబ్బరిబొండాలు

ఎంవీపీకాలనీ: లాసన్స్ బే కాలనీ నంది గుడి కూడలి రోడ్డులో ఓ కోకోనట్ జ్యూస్ వ్యాపారి వాడేసిన కొబ్బరిబొండాలను పెద్ద ఎత్తున షాప్ పక్కనే గుట్టగా నిల్వ చేస్తున్నాడు. దీంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారడంతోపాటు దోమలు ప్రబలుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, శానిటేషన్ అధికారులు తక్షణం స్పందించి.. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కిశోర బాలికల వేసవి శిబిరం ప్రారంభం


ఆరిలోవ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న కిశోర బాలికల వేసవి శిబిరం


జాలరిపేట అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న వినీషా


కేఆర్‌ఎం కాలనీ అంగన్‌వాడీ సెంటర్ వేసవి శిబిరంలో కిశోర బాలికలు


రజకవీధి అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు అవగాహన

ఆరిలోవ: కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆరిలోవ నెహ్రూనగర్‌లోని రాజేంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికల వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీవో కుమారి ఆదేశాలతో నిర్వహిస్తున్న ఈ శిబిరం జూన్ 10 వరకు కొనసాగుతుందని సూపర్‌వైజర్ సెల్వియా తెలిపారు. మొదటి రోజు స్థానిక బాలికలకు పరిచయ కార్యక్రమం నిర్వహించామన్నారు. వారంలో రెండు రోజులు పోక్సో చట్టం, బాల్య వివాహాల వల్ల అనర్థాలు, పౌష్టికాహారం తదితర అంశాలపై వేసవి శిబిరంలో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కామేశ్వరి, అన్నపూర్ణ, మహిళా కానిస్టేబుల్, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

ఎంవీపీకాలనీ: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాలరిపేట అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానిక కిశోర బాలికలను సమీకరించి అవగాహన కల్పించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్ సూపర్‌వైజర్ వినీషా మాట్లాడుతూ కిశోర బాలికల్లో పోషక విలువలు, వికాసానికి ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. వేసవి శిబిరాల ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు ఆశా వర్కర్లు, ఆర్పీల సహకారంతో బాలికలకు సేవలందుతాయన్నారు. ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా బాలికలకు ఆరోగ్యం, విద్యతోపాటు లైఫ్ స్కిల్స్ మెరుగుపర్చేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. ఆరోగ్య పరిరక్షణ జాగ్రత్తలను బాలికలకు ఆమె వివరించారు. ఎలాంటి సమస్యలున్నా అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఆర్పీల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్పీలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

జూన్ 10 వరకు శిబిరాలు

మద్దిలపాలెం: అర్బన్ మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.వి.రమణకుమారి ఆదేశాల మేరకు కేఆర్‌ఎం కాలనీ–1, రజకవీధి అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికల వేసవి శిబిరాలు ప్రారంభించామని కార్యకర్తలు ఆర్.సుబ్బలక్ష్మి, మాధవి తెలిపారు. ఏసీడీపీవో శ్రీలత పర్యవేక్షణలో సూపర్‌వైజర్ సెల్వియా ఆధ్వర్యంలో జూన్ 10 వరకు శిబిరాలు జరుగుతాయన్నారు. తొలి రోజు బాలికల పరిచయాలు, లక్ష్యాల గురించి వివరించామని చెప్పారు. ఎంఎస్‌కే సిహెచ్.అలేఖ్య, ఏఎన్‌ఎం వి.సత్యవేణి, ఆశా వర్కర్ లక్ష్మీకాంతం, వీవో రామలక్ష్మి, కిశోర బాలికలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వేళాపాళా లేని చెత్త సేకరణ


సుందరయ్య కాలనీలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట దాటిన తర్వాత చెత్త సేకరిస్తున్న సిబ్బంది, వాహనం

ఆరిలోవ: జీవీఎంసీ వార్డుల్లో వేళాపాళా లేకుండా చెత్త సేకరణ జరుగుతోంది. శానిటరీ విభాగం అధికారులు పట్టించుకోక పోవడంతో చెత్త సేకరణ వాహనాలు వార్డుల్లోకి ఏ సమయంలో వస్తున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. 12వ వార్డు 21వ సచివాలయం పరిధిలో తరచూ ఇదే పరిస్థితి. జ్యోతినగర్, టీబీసీ పాయింట్ ప్రాంతాల్లోకి శుక్రవారం మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల మధ్యలోను, సుందరయ్య కాలనీలో మధ్యాహ్నం ఒంటి గంట దాటిన తర్వాత చెత్త సేకరించే జీవీఎంసీ వాహనం, సిబ్బంది వెళ్లారు. ఆయా సమయాల్లో ఇళ్ల వద్ద ఉన్న కొద్ది మంది మాత్రమే సిబ్బందికి చెత్త అందించగలిగారు. మిగిలిన వారి ఇళ్లలో చెత్తతో డబ్బాలు ఎదురుచూస్తున్నాయి. ఈ వార్డులో తరచూ ఇదే పరిస్థితి ఉండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 10 గంటల లోపే కొందరు ఉద్యోగాలకు, ఏదో పనిమీద ఇంటి నుంచి బయటకు వెళ్లే వారి చెత్త రెండో రోజుకు నిల్వ ఉండిపోతోందని అంటున్నారు. జీవీఎంసీ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక ఇంటి ముందు చెత్తతో డబ్బా పెడితే దాన్ని కుక్కలు బయటకు తీసి చెల్లాచెదురు చేసేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని, శానిటరీ విభాగం అధికారులు దృష్టి సారించి ఉదయం 9 గంటల లోపు చెత్త సేకరించే వాహనాలు వీధుల్లోకి వచ్చేటట్లు చర్యలు చేపట్టాలని 12వ వార్డు ప్రజలు కోరుతున్నారు.

రెగ్యులరైజ్ చేయండి

సీతమ్మధార: ఆరేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న తమను రెగ్యులరైజ్ చేయాలంటూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు డిమాండ్ చేశారు. వారు చేపట్టిన నిరవధిక సమ్మె నేటికి ఐదో రోజుకు చేరుకుంది. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో తమ డిమాండ్లు వినిపిస్తూ నిరసన కొనసాగించారు. ఏడాది కాలంగా పీఎఫ్ కట్ చేయడం నిలిపివేశారని, మార్చి 2022 తర్వాత తమకు రావాల్సిన ఇన్సెంటివ్స్ కూడా నిలిపివేశారని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ స్వాతి ఆవేదన వ్యక్తం చేశారు. తమ గోడు పట్టించుకునే నాథుడే లేడని వాపోయారు. కార్యక్రమంలో పలువురు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అలరించిన సాంఘిక నాటిక ప్రదర్శనలు


నాటికలను ప్రారంభిస్తున్న వీఎండీఏ ప్రతినిధులు


అనశ్వరం నాటికలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజికల్ డ్యాన్స్ అకాడమీ నెలవారీ నాటిక ప్రదర్శనల్లో భాగంగా శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ప్రదర్శించిన రెండు సాంఘిక నాటికలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్‌ఎన్.రాజు, డాక్టర్ గుమ్మలూరి రాంబాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా విజయవాడకు చెందిన శ్రీకృష్ణ తెలుగు థియేటర్ వారిచే బర్రె సత్యనారాయణ కలం నుంచి జాలువారిన అనశ్వరం నాటిక ప్రదర్శించారు. రెండోదిగా సహోదయ ఆర్ట్స్ పిఠాపురం గ్రామీణ సమాఖ్య వారిచే ఉడతా ఉడతా నాటికను అద్భుతంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

రవీశ్వరరావుకు ఘన సత్కారం


రవీశ్వరరావును సత్కరిస్తున్న రెహ్మాన్, యాదవ ఐక్యవేదిక నాయకులు

దాబాగార్డెన్స్: ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన యాదవ సంఘం నాయకుడు గొలగాని రవీశ్వరరావును యాదవ ఐక్యవేదిక శుక్రవారం బీచ్ రోడ్డు గోకుల్ పార్క్ వద్ద ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఏ రెహ్మాన్ మాట్లాడుతూ రవీశ్వరరావు కార్యదీక్షాపరుడని, ఏ పనైనా చేయగల సత్తా ఆయనలో ఉందన్నారు. ఒకానొకప్పుడు తాను ఎమ్మెల్యేగా విజయం సాధించానంటే.. దానిలో ఆయన పాత్ర ఉందన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అత్తి శంకరరావు మాట్లాడుతూ రవీశ్వరరావు పదవీ విరమణ సత్కార కార్యక్రమంలో తాను భాగస్వామి కావడం సంతోషంగా ఉందన్నారు. యాదవ ఐక్య వేదిక ఆధ్వర్యంలో వేదిక జాతీయ అధ్యక్షుడు అలిసి అప్పలనారాయణ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు గొలగాని రామారావు, పల్లా బాచీ, గొలగాని ప్రసాద్, ఉరుకుటి మురళీ, మువ్వల ప్రేమ్‌కుమార్, పిన్నింటి ఆదిమూర్తి, ఒమ్మి కనకరాజు, వెంకటలక్ష్మి, నక్కా సావిత్రి, నక్క పద్మ పాల్గొన్నారు.

ఇంటి నుంచి వచ్చేసిన యువకుడికి రెడ్‌క్రాస్ హోంలో ఆశ్రయం


రెడ్‌క్రాస్ హోం నిర్వాహకుడికి సాహును అప్పగిస్తున్న సీఐ పైడయ్య

బీచ్‌రోడ్డు: తండ్రితో మనస్పర్థల కారణంగా కోపంతో ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా విశాఖ వచ్చేసిన యువకుడిని రెడ్‌క్రాస్ హోంకు మూడో పట్టణ పోలీసులు తరలించారు. వారు తెలిపిన వివరాలిలా.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం డొంగరగొన జిల్లాకు చెందిన లీలయం సాహు అనే యువకుడు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పాత సీబీఐ బస్టాప్ వద్ద అనుమానంగా తిరుగుతూ ఉండటంతో గమనించిన పోలీసులు అతడిని పూర్తిగా విచారించారు. ఆ యువకుడు చెప్పిన వివరాలతో కుటుంబ సభ్యులను పోలీసులు సంప్రదించగా.. ఇప్పటికే సాహుపై మిస్సింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు. సాహు కుటుంబ సభ్యులు వచ్చే వరకు రెడ్‌క్రాస్ హోంలో యువకుడు ఉండేలా చర్యలు తీసుకున్నారు. రెడ్‌క్రాస్ నిర్వాహకుడు మురళీకి సీఐ పైడయ్య యువకుడు సాహును అప్పగించారు.

జోరుగా భూగర్భ విద్యుత్ లైన్ పనులు


విమ్స్ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న భూగర్భ విద్యుత్ లైన్లు


ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక జరుగుతున్న భూగర్భ విద్యుత్ లైన్ పనులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో భూగర్భ విద్యుత్ లైన్ పనులు కొద్ది రోజులుగా జోరుగా జరుగుతున్నాయి. విద్యుత్‌ సబ్ స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా జరిగే ప్రాంతాల వరకు ఈ పనులు జరిపిస్తున్నారు. ప్రస్తుతం విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో ఉన్న సబ్ స్టేషన్ నుంచి జాతీయ రహదారి వైపు అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ అమర్చుతున్నారు. ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రోడ్లలో జీవీఎంసీ డంపింగ్ యార్డు ఎదురుగా ఉన్న సబ్ స్టేషన్ నుంచి ఆరిలోవ కాలనీ వైపు దీని పనులు జరుగుతున్నాయి.

ప్రమాదకరంగా గోతులు

విద్యుత్ కేబుళ్లు అమర్చడానికి ఆయా చోట్ల సుమారు 5 అడుగుల లోతులో కాలువ మాదిరిగా తవ్వారు. వందల మీటర్ల పొడవున తవ్వన తర్వాత కేబుల్ అమర్చుతున్నారు. అంతవరకు తవ్విన గోతులు ప్రమాదకరంగా మారుతున్నాయి. అటుగా వెళ్తున్న వారు అదుపుతప్పి వాటిలో పడిపోతున్నారు. ముడసర్లోవ ప్రాంతంలో ఎక్కువగా పాడి పశువులను మేతకు తీసుకెళ్తుంటారు. అవి ఆ గోతుల్లోకి జారిపోతున్నాయి. వాటిని తిరిగి రోడ్డుపైకి ఎక్కించడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోందని పాడి పశువుల రైతులు వాపోతున్నారు. అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులు తొందరగా జరిపించాలని వారు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



రేసపువానిపాలెం లోని రోడ్డు మధ్యలో యూజీడీ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. మ్యాన్‌హోల్‌లో చెత్త తీసిన జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది దాన్ని మూసివేయకుండా వదిలేశారు. దీంతో ఆ దారిలో వెళ్లే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ఎవరైనా దానిని గమనించని పక్షంలో అందులో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశాలున్నాయి.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం